సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 21 । జూన్ । 2023



ఎకో టూరిజం హబ్‌గా సిల్క్‌ఫారం

అంజోడ సిల్క్‌ఫారంను ఏకో టూరిజం హబ్‌గా తీర్చిదిదేందుకు చర్యలు చేపట్టామని అటవీశాఖ చీఫ్ ప్రిన్సిపల్ కన్జర్వేటర్ మధుసూదనరెడ్డి తెలిపారు. 8లో



దారి కాసిన మృత్యువు

పండగకు బైక్‌పై బయలుదేరిన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయారు. 8లో



మన్యంలో భారీ వర్షం

పాడేరు డివిజన్‌లోని పలుచోట్ల రెండు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. 8లో

న్యూస్‌రీల్

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయాలి

- ఐటీడీఏ పీవో అభిషేక్



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

హుకుంపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష పథకం విజయవంతానికి ముందస్తు ప్రణాళికలతో అధికారులు సిద్ధం కావాలని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం జగనన్న సురక్ష పేరుతో కొత్త పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ నెల 24 నుంచి పథకం ప్రారంభం అవుతుందన్నారు. దీనిని విజయవంతం చేసేందుకు గ్రామసచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు కృషి చేయాలని సూచించారు. ఎంపీపీ కూడా రాజుబాబు, ఎంపీడీవో వెంకటరావు,తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఈవోపీఈఆర్డీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీఐలో స్వల్పకాలిక కోర్సులు

- దరఖాస్తు చేసేందుకు ఈనెల 26 వరకు గడువు
- ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు

అరకులోయ రూరల్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ప్రధాన మంత్రి కౌశల్ యోజన(పీఎంకేవీవై)లో మూడు నెలల స్వల్పకాలిక కోర్సులు ఉచితంగా నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ టెన్త్ ఉత్తీర్ణత లేదా, ఆపై చదువుకుని 18 నుంచి 30 సంవత్సరాల వయసు గల వారు అర్హులన్నారు. ఆసక్తి గల వారు విద్యార్హత, ఆధార్ జెరాక్స్‌లతోపాటు పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో ఈనెల 26వ తేదీ నాటికి ఐటీఐలో అందజేయాలని ఆయన కోరారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

సాక్షి, పాడేరు: రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గిరిజన బాలిక జీరుగుబోయిన శ్రీవల్లి (14) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందింది. మారుమూల అయినాడ పంచాయతీలో జరిగిన బైక్ ప్రమాదంలో శ్రీవల్లి తీవ్రంగా గాయపడడంతో ఆమెకు మెరుగైన వైద్యసేవలు కల్పించేందుకు పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఎంతో కృషి చేసినా ఫలితం లేకపోయింది. మృతురాలి తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులను ఆమె ఫోన్లో పరామర్శించారు. శ్రీవల్లి మృతదేహాన్ని అయినాడ పంచాయతీకి తరలించేందుకు అంబులెన్స్‌ను ఏర్పాటు చేశారు. అంత్యక్రియలకు సంబంధించి రూ.10వేల ఆర్థికసాయాన్ని కూడా బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పంపించి మానవత్వం చాటుకున్నారు

డోలీలో ఆస్పత్రికి తరలిస్తుండగా గర్భిణి మృతి



డోలీలో గర్భిణి రోజాను తీసుకువెళ్తున్న స్థానికులు



రోజా మృతదేహం

కొయ్యూరు: ప్రసవ వేదనతో బాధపడుతున్న గర్భిణిని డోలీలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే ప్రాణాలు విడిచింది. మండలంలోని మూలపేట పంచాయతీ కుమ్మర్లకు చెందిన కొర్రా రోజా (22)కు మంగళవారం సాయంత్రం పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. రహదారి లేనందున ఆమెను డోలీలో ఆశా కార్యకర్త శాంతి, గ్రామస్తులు డౌనూరు ఆస్పత్రికి తీసుకువస్తున్నారు. గ్రామం నుంచి కిలోమీటరు దాటిన తరువాత పురిటినొప్పులు ఎక్కువవడంతో భరించలేక గర్భిణి రోజా మృతి చెందింది. రహదారి లేకపోవడం వల్లే సకాలంలో ఆస్పత్రికి తీసుకువెళ్లలేకపోయామని వారు పేర్కొన్నారు. రెండేళ్ల క్రితం గ్రామస్తులు చందాలు వేసుకుని రహదారి ఏర్పాటుచేసుకున్నారు. వర్షాలకు పూర్తిగా పాడైంది. సుమారు 150 మంది జనాభా ఉన్న తమ గ్రామానికి రహదారి మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కాఫీ రైతు కళకళ

కాఫీ రైతులకు ఈ ఏడాది పరిస్థితులు అనుకూలంగా కనిపిస్తున్నాయి. ముందుగా వర్షాలు కురవడంతో కాఫీ తోటలకు మేలు చేసింది. పూత దశలో ఉండాల్సిన తోటలు ఇప్పుడు పిందెలతో కళకళలాడుతున్నాయి. రైతుల్లో లాభాల ఆశలు చిగురిస్తున్నాయి.

- అనుకూలంగా వాతావరణం
- మేలు చేసిన ముందస్తు వర్షాలు
- పిందెతో నిండుగా తోటలు
- గిరి రైతుల్లో చిగురిస్తున్న ఆశలు



సాక్షి, పాడేరు: ఏజెన్సీలోని గిరిజనులు సాగు చేస్తున్న కాఫీ పంట ఈ ఏడాది కూడా సిరులు కురిపించనుంది. మార్చి నుంచి విస్తారంగా కురిసిన భారీ వర్షాలు కాఫీ సాగుకు మేలు చేశాయి. సాధారణంగా కాఫీ పూత మేనెలలో పూస్తుంది. ఈ ఏడాది ముందస్తు వర్షాల వల్ల నెలరోజుల ముందుగానే పూత వచ్చింది. ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలు కూడా కాఫీ తోటలకు ఉపయోగపడుతున్నాయి. ప్రస్తుతం పిందెతో తోటలు కళకళలాడుతున్నాయి. దీంతో దిగుబడులపై గిరి రైతులు ఆశలు పెంచుకున్నారు. గతేడాది మాదిరిగానే సీజన్ కలిసి వస్తుందన్న ఆశతో ఉన్నారు. ఉద్యానవన పంటల్లో కాఫీ సాగుపై ఆధారపడిన గిరి రైతులు ఎక్కువ మంది ఉన్నారు. వచ్చే ఫలసాయంతో ఇంటిల్లిపాది జీవనోపాధి పొందుతుంటారు.

లాభదాయకంగా ధర

జిల్లాలోని ఏజెన్సీలోని 11 మండలాల పరిధిలో 2లక్షల 27వేల 21ఎకరాల విస్తీర్ణంలో కాఫీ తోటలు ఉన్నాయి. వీటిలో 2లక్షల 18వేల 393 మంది గిరిజన రైతులు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పాడేరు ఐటీడీఏ ద్వారా కాఫీని సాగు చేస్తున్నారు. వీటిలో లక్షా 42వేల 515 ఎకరాల కాఫీ తోటలు ఫలసాయాన్ని ఇస్తున్నాయి. గతేడాది 14 వేల మెట్రిక్ టన్నుల క్లీన్ కాఫీ గింజలను గిరిజన రైతులు మార్కెటింగ్ చేశారు. . ఈఏడాది కాఫీ గింజలకు రికార్డు ధర నెలకొనడంతో కాఫీ సాగు చేసిన రైతులంతా మంచి లాభాలు పొందారు. పాచ్‌మెంట్ కాఫీ గింజలను గిరిజన రైతులు కిలో రూ.270 నుంచి రూ.300కు విక్రయించారు. పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో చేపట్టిన కాఫీ ప్రాజెక్టు వల్ల సుమారు లక్ష ఎకరాల్లో కాఫీ తోటల విస్తీర్ణం పెరిగింది. సిల్వర్ ఓక్, కాఫీ మొక్కలు, సాగు ఖర్చులకు సాయం అందజేయడమే కాకుండా ఉపాధి నిధులను కూడా ప్రభుత్వం వెచ్చించింది. ప్రాజెక్టులో భాగంగా బేబీ పల్పర్ యూనిట్లను ప్రభుత్వం అందజేసింది.

దిగుబడి పెరిగే అవకాశం



ఈఏడాది దిగుబడి పెరిగే అవకాశం ఉంది. ముందుగా కురిసిన వర్షాల వల్ల కాఫీ పిందె ఏపుగా పెరుగుతోంది. గతేడాది 14 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి రాగా ఈఏడాది 16 వేల మెట్రిక్ టన్నులకు పెరిగే అవకాశం ఉంది. వాతావరణ పరిస్థితులు ఇప్పటివరకు కాఫీసాగుకు మాత్రం అనుకూలంగా ఉన్నాయి.

– అశోక్, ఏడీ, కాఫీ విభాగం, పాడేరు ఐటీడీఏ

'జగనన్న ఆణిముత్యాలు' వీరే





జిల్లాకు చెందిన ఇంటర్‌మీడియెట్ విద్యార్థినులు ఎస్.ఇందిర, బి.కృపావతి అమరావతిలో మంగళవారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా జగనన్న ఆణిముత్యాలు అవార్డులను అందుకున్నారు.

ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోండి





మాట్లాడుతున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, అభ్యర్థులు

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్
- జాబ్‌మేళాలో 134 మంది ఎంపిక
- జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సాక్షి, పాడేరు: ప్రైవేట్ రంగంలోను ఉద్యోగ, ఉపాధి అవకాశాలను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏర్పాటుచేసిన మెగా జాబ్‌మేళాను ఐటీడీఏ పీవో వి.అభిషేక్, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ సొంత ప్రాంతాలలోనే ఉద్యోగాలు వస్తేనే పనిచేస్తామని అనుకోవడం సరికాదన్నారు. బిహార్,జార్ఖండ్,ఒడిశా రాష్ట్రాలకు చెందిన వారు కూడా ఏపీ,తెలంగాణలో పనిచేస్తున్నారన్న విషయాన్ని గుర్తించాలన్నారు. పనిచేస్తున్నారనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు.అందరికి ప్రభుత్వ ఉద్యోగాలు సాధ్యం కాదన్నారు. ప్రైవేట్ రంగాల్లో వస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర కోరారు.తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడి పిల్లలను చదివిస్తున్నారని, వారి ఆశయాలు, కుటుంబ ఉన్నతికోసం ఉద్యోగాలు చేయాల్సిన బాధ్యత ఉందన్నారు.చదువులకు తగ్గట్టుగానే ఉద్యోగాలు చేసి ఆర్థికాభివృద్ధి సాధించాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి సూచించారు. ఉద్యోగాలు చేసి కుటుంబానికి అండగా నిలవాలని సూచించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గిరిజన ప్రాంతాలలో నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఎంతో కృషి చేస్తున్నారని,సచివాలయాల ఉద్యోగాల్లో నూరుశాతం ఉద్యోగాలన్నీ గిరిజన అభ్యర్థులతోనే భర్తీ చేశారన్నారు. ఉపాధి కల్పనలో భాగంగా శిక్షణ కేంద్రాలతో పాటు స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేశారని ఆమె వివరించారు.

జాబ్‌మేళా విజయవంతం

పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళా విజయవంతమైంది. నవతా రోడ్డు ట్రాన్స్‌పోర్టు,ఫెయిర్ ఫీల్డ్ మారియోట్,అపోలో ఫార్మసీ, కేర్ ఫర్ యూ, మోహన్ స్పిన్టెక్స్ ఇండియా, డెక్కన్ కెమికల్ ప్రయివేట్ లిమిటెడ్, అరబిందో, ముత్తూట్ ఫైనాన్స్. టీమ్‌లీజ్(యూనియన్ బ్యాంకు,ఎస్‌బీఐ) వైఎస్‌కే ఇన్ఫోటెక్, పేటీఎం, కాగ్నెస్ట్ ఈసర్వీసెస్ తదితర కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు ఉద్యోగాల భర్తీకి హాజరయ్యారు. జాబ్‌మేళాకు 456 మంది హాజరు కాగా 134 మంది పలు విభాగాల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ట్రైనీకలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి ప్రశాంత్‌కుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.చిట్టబ్బాయి, ఎన్ఎస్ఎస్ పీవో గౌరీశంకర్, అధ్యాపకులు, నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరి సంక్షేమమే లక్ష్యం

అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

పెదబయలు: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష పథకం లక్ష్యమని అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో జగనన్న సురక్ష పథకం విధి విధానాలను వివరించారు. మండల, క్లస్టర్, గ్రామ స్థాయిలో ఈ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించిన తరువాత డోర్ టు డోర్ సర్వే చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం నూరుశాతం ప్రజలు సద్వినియోగం చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. మండలంలో ఎంపీడీవో, తహసీల్దార్లు రెండు బృందాలుగా ఏర్పడి ఈ కార్యక్రమం సక్రమంగా జరిగేలా పర్యవేక్షణ చేస్తారన్నారు. క్షేత్ర స్థాయిలో పని చేసే గ్రామ సచివాలయం ఉద్యోగితో పాటుగా వలంటీర్లు, గృహసారథులు, అంగనవాడీ, ఆశ వెలుగు, ఉపాధి సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. గ్రామ సచివాలయంలో వలంటీర్లు ఇతర సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. బడి మానేసి, బడి ఈడు పిల్లలను గ్రామస్థాయిలో గుర్తించాలని వెల్ఫేర్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో పూర్ణయ్య, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణారావు, మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాపికొండల అభయారణ్యం పరిశీలన

- పర్యాటక బోటుపై వెళ్లిన అటవీశాఖ ఉన్నతాధికారులు

దేవీపట్నం: గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో విస్తరించిన పాపికొండల జాతీయ అభయారణ్యాన్ని అటవీశాఖ ఉన్నతాధికారులు మంగళవారం పరిశీలించారు. మండలంలోని పోశమ్మగండి నుంచి పర్యాటక బోటుపై అదనపు ముఖ్య అటవీ అరణ్యాధికారి (వైల్డ్‌లైఫ్) శాంతిప్రియ పాండే, రాజమండ్రి సీసీఎఫ్ శర్వానంద్, రంపచోడవరం డీఎఫ్‌వో నరేందరన్, ఏలూరు డీఎఫ్‌వో రవీంద్ర ధామా, చింతూరు డీఎఫ్‌వో సౌజన్య, రంపచోడవరం సబ్ డీఎఫ్‌వో భరణి, పోలవరం, ఇందుకూరు, చింతూరు, కుక్కునూరు, వీఆర్‌పురం రేంజ్ అధికారుల బృందం పాపికొండల ప్రాంతానికి తరలివెళ్లారు. పశ్చిమగోదావరి జిల్లా వైపు గల కొరుటూరు కాటేజీలను తనిఖీ చేశారు. పాపికొండల నేషనల్‌పార్కు పరిధిలో గల దాసన్నపేట రోడ్డును పరిశీలించారు. అనంతరం వన్యప్రాణుల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు.

విధులకు ఆలస్యంగా ఉపాధ్యాయుడు

ప్రశ్నిస్తే వాగ్వాదానికి దిగాడని సర్పంచ్,గ్రామస్తుల ఆరోపణ



ఉపాధ్యాయుడి కోసం ఎదురు చూస్తున్న తుమ్మలబంద విద్యార్థులు

కొయ్యూరు: విధులకు ఆలస్యంగా ఎందుకు వచ్చారని ప్రశ్నించిన సర్పంచ్, గ్రామస్తులతో ఉపాధ్యాయుడు వాగ్వాదానికి దిగారు. గ్రామస్తుల కథనం మేరకు వివరాలిలాఉన్నాయి. మండలంలోని తుమ్మలబంద పాఠశాల ఉపాధ్యాయుడు అప్పారావు మంగళవారం ఉదయం పది గంటలు దాటిన తరువాత పాఠశాలకు వచ్చారు. ఆలస్యంగా రావడాన్ని గమనించిన సర్పంచ్ ఇంగువ త్రినాథ్‌పడాల్, మాజీ సర్పంచ్ సత్తిబాబు, గ్రామస్తులు ఆయనను ప్రశ్నించారు. దీంతో ఎవరికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదంటూ తమతో ఉపాధ్యాయుడు వాగ్వాదానికి దిగారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుడు అప్పారావు ఇక్కడికి బదిలీపై వచ్చిన నాటి నుంచి మద్యం సేవించి విధులకు హాజరవుతున్నారని, సకాలంలో రావడం లేదని ఆరోపించారు. మంగళవారం నాడు కూడా మద్యం సేవించి వచ్చారని ఆయన వివరించారు. గతంలో ఆయన చింతవానిపాలెం పనిచేసినప్పుడు విధులకు డుమ్మాకొట్టడంపై అప్పటిలో విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయన్నారు. ఆయన ప్రవర్తనపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని సర్పంచ్ తెలిపారు. దీనిపై ఉపాధ్యాయుడు అప్పారావును వివరణ కోరగా విధులకు సక్రమంగానే హాజరవుతున్నట్టు చెప్పారు. మద్యం సేవించి విధులకు వస్తున్నట్టు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని ఆయన తెలిపారు.

గిరిజనుల్లో చైతన్యం నింపేందుకు జాగృతి

- దృశ్య, శ్రవణ విధానంలో అవగాహన కల్పిస్తాం
- అక్షర కార్యక్రమానికి 50 మంది నిరుద్యోగుల ఎంపిక
- చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్



సారాను ధ్వంసం చేస్తున్న కొయ్యూరు పోలీసులు



మాట్లాడుతున్న అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిషోర్

కొయ్యూరు: అన్ని అంశాలపై గిరిజనులకు అవగాహన కల్పించేందుకు జాగృతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ వెల్లడించారు. మంగళవారం ఆయన స్థానిక పోలీసుస్టేషన్ పరిధిలో 58 కేసుల్లో స్వాధీనం చేసుకున్న వెయ్యి లీటర్ల సారాను పోలీసులు ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. మారుమూల ప్రాంతాలకు పోలీసులు దృశ్య, శ్రవణ విధానంలో అనేక అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. బాల్య వివాహాలు, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే ఎలాంటి సమస్యలు తలెత్తుతాయోనన్న అంశాలు వివరించి వారిలో చైతన్యం నింపేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. డిజిటల్ లైబ్రరీపై శిక్షణ ఇచ్చేందుకు వీలుగా రూపొందించిన అక్షర కార్యక్రమానికి చింతపల్లిలో 50 మంది నిరుద్యోగులను ఎంపిక చేశామని ఆయన పేర్కొన్నారు. వారికి జూలై నుంచి నెలకు రూ.వెయ్యి స్టైఫండ్ ఇస్తామన్నారు. ఇలా వంద మందికి శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మద్యానికి బానిస అయిన వారిని గుర్తించి డి ఆడిక్షన్ సెంటర్లకు పంపిస్తామన్నారు.

గ్రామాల్లో వారిని గుర్తించే బాధ్యత మహిళ పోలీసులకు అప్పగిస్తామన్నారు. మాజీ మావోయిస్టులు, సారా తాగి భర్తలు చనిపోతే ఇబ్బందుల్లో ఉన్న వారికి ప్రధానమంత్రి ఉపాధి కల్పన యోజనలో రుణాలు ఇచ్చేందుకు ప్రతీ పోలీసుస్టేషన్ పరిధిలో ఐదుగురిని మొదటి విడతలో ఎంపిక చేశామన్నారు. 35 శాతం రాయితీ కాగా, లబ్ధిదారుడు యూనిట్ వ్యయంలో ఐదు శాతం నిధులు సమకూరిస్తే బ్యాంకులు 60శాతం నిధులను రుణ రూపంలో ఇస్తాయన్నారు. ఎలాంటి విద్యార్హత లేకున్నా ఆధార్ కార్డు ఉంటే డ్రైవింగ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేయవచ్చన్నారు.ఆధార్‌కు ఫోన్ నెంబర్ లింకయితే సరిపోతుందన్నారు. ఆటోలకు విధిగా నంబర్లు కేటాయించి రిజిస్టర్ అమలు చేయాలని సీఐ స్వామినాయుడు,కొయ్యూరు,మంప ఎస్ఐలు రాజారావు, లోకేష్‌కుమార్‌లను ఆదేశించారు. ఆటో డ్రైవర్లకు గ్రూపు బీమాపై అవగాహన కల్పించాలన్నారు. ఘాట్‌రోడ్డులో రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పెరిగి ఉన్నందున ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. వెంటనే వాటిని తొలగించేందుకు ఆర్అండ్‌బీ/ఎన్‌హెచ్ అధికారులకు నోటీసు జారీ చేయాలని సూచించారు. మన్యంలో 15 వేల ఎకరాల్లో గంజాయిని పూర్తిగా తొలగించామని తెలిపారు. గంజాయి రవాణా కూడా తగ్గిందన్నారు. త్వరలో బూదరాళ్ల పంచాయతీ వంతమర్రి/ గరిమండలో మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. బీఎస్ఎన్ఎల్ టవర్లు అన్ని చోట్ల పనిచేసేలా చర్యలు తీసుకుంటామని అదనపు ఎస్పీ తెలిపారు.

వైద్యసేవలపై నిర్లక్ష్యం వద్దు

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- వైద్యాధికారులతో సమీక్ష



ముంచంగిపుట్టు సీహెచ్‌సీలో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ముంచంగిపుట్టు: ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్నిరకాల సదుపాయాలు ఉన్నాయని, వైద్య సేవలు అందించడంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. మంగళవారం ఆయన స్థానిక సీహెచ్‌సీ, కిలగాడ పీహెచ్‌సీలను సందర్శించారు. తనిఖీలు నిర్వహించారు. రోగుల వద్దకు వెళ్లి వైద్య సేవలపై ఆరా తీశారు. మందుల గదులను పరిశీలించారు. నిల్వల వివరాలను వైద్య సిబ్బంది నుంచి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రుల్లో పలు రికార్డులను తనిఖీ చేశారు. స్థానిక సీహెచ్‌సీలో వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆస్పత్రిలో సమస్యలు తెలుసుకున్నారు. సీహెచ్‌సీలో రోగుల సంఖ్య పెరుగుతుంటే కిలగాడ పీహెచ్‌సీలో రోగుల సంఖ్య తగ్గుదలపై వైద్యాధికారుల నుంచి కారణాలు తెలుసుకున్నారు. సీహెచ్‌సీలో అత్యవసర మందులు కొనుగోలుకు ఆస్పత్రి అభివృద్ధి కమిటీతో సంబంధం లేకుండా రూ.20 వేలు ఖర్చు చేయవచ్చునని ఆదేశించారు. కొనుగోలు చేసే దానికి బిల్లులు కచ్చితంగా బిల్లులు సమర్పించాలని సూచించారు. వైద్య పరికరాల గది ఏసీకి సంబంధించి అవసరమైన సామగ్రిని ఆస్పత్రి అభివృద్ధి నిధులతో కొనుగోలు చేయాలని సూచించారు. శిశు జనన నిరీక్షణ కేంద్రంలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. మాతాశిశు మరణాలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎస్ఎన్‌సీయూ సిబ్బందికి సూచించారు.

డిప్యూటేషన్‌పై స్టాఫ్ నర్సు నియామకం

కిలగాడ పీహెచ్‌సీలో ముగ్గురు స్టాఫ్ నర్సుల్లో ఒకరిని ముంచంగిపుట్టు సీహెచ్‌సీలో డిప్యూటేషన్‌పై నియమించాలని డీఎంఅండ్‌హెచ్‌వో జమాల్‌బాషాను కలెక్టర్ ఆదేశించారు. రానున్న మూడు నెలలు ఎపిడమిక్ సీజన్ కావడంతో వైద్యులు, సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. మందుల కొరత లేకుండా చూసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం లుంగాపుట్టు పెట్రోల్ బంకును కలెక్టర్ సందర్శించారు. అన్నివేళలా పెట్రోల్,డీజిల్ అందుబాటులో ఉండేలా చూడాలని బంక్ సిబ్బందికి సూచించారు.

'రూర్బన్ మిషన్'తో గ్రామాల అభివృద్ధి

రంపచోడవరం: రూర్బన్ మిషన్ ద్వారా ఏజెన్సీలో గ్రామాల అభివృద్ధి జరుగుతుందని కేంద్ర ప్రభుత్వ ఎకనామికల్ సర్వీసెస్ సభ్యుడు కె.ఎం.బాలరాజు చెప్పారు. మండల కేంద్రంలో ఆయన మంగళవారం పర్యటించి, ఐటీడీఏ పీవో సూరజ్ గనోరేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని రూర్బన్ మిషన్ ద్వారా చేపట్టిన పలు అభివృద్ధి పనులపై చర్చించారు. స్టేట్ ప్రాజెక్ట్ ప్రతినిధులు ఎస్.శ్రీనాథ్, వినోద్ కుమార్, ఎంపీడీవో జాన్ విల్సన్ పాల్గొన్నారు.

ఐటీడీఏ పీవోను కలిసిన జెడ్పీ సీఈవో

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జెడ్పీ సీఈవో ఎ.రమణారెడ్డి మంగళవారం రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే వారిని మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఏజెన్సీలో అభివృద్ధి పనులపై చర్చించారు.ఎంపీడీవో జాన్‌విల్సన్ తదితరులున్నారు.

ఏజెన్సీ అభివృద్ధికి ముందుకు రావాలి

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే



సోలార్ దీపాలు అందజేస్తున్న రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: ఏజెన్సీ అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పీఎంఆర్‌సీ మంగళవారం ఎన్జీవో ద్వారా మారుమూల గ్రామాలకు సోలార్ వీధిలైట్లు పంపిణీకి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు వచ్చి గిరిజన ప్రాంత అభివృద్ధికి సహకరించాలని కోరారు. గిరిజన గ్రామాలైన పుల్లంగి, చావడికోట, బోలకొండ, రంపచోడవరం, అనిగేరు, ఆకూరు, వేములకొండ, మర్రిపాలెం పంచాయతీల్లో ఒక్కొక్కటి రూ.14 వేల విలువైన వంద సోలార్ విద్యుత్ దీపాల ఏర్పాటు అభినందనీయమన్నారు. ఏజెన్సీ అభివృద్ధి చేసే స్వచ్ఛంద సంస్థలకు ఐటీడీఏ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. సోలార్ వీధి దీపాలను ఆయా గ్రామాలకు పీవో చేతులమీదుగా అందజేశారు. సోలార్ దీపాల కొనుగోలుకు సహకరించిన ఆర్థిక సహాయకులు గ్రీన్ ఎనర్జీ ఆంధ్రప్రదేశ్ ఎన్జీవోకు. ఆదివాసీ మహాసభ సంస్థ కార్యదర్శి జి.చిన్నారావు. సహాయకులు ఐ.సూర్య నారాయణ, న్యాయవాది ఏపీ సత్యనారాయణ, వన్ చైల్డ్ వన్ లైట్ సహాయకులు ప్రాజెక్టు అమలు చేసిన విజయవాడకు చెందిన ఆల్ట్ ఎన్జీవో, చెన్నారెడ్డి, వీరభద్రారెడ్డి, పాండవులు తదితరులను పీవో అభినందించారు.